రవీందర్ మృతి ప్రజలకు తీరని లోటు

కుటుంబ సభ్యులను పరామర్శించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

చిగురుమామిడి, సెప్టెంబర్ 11 (వాయిస్ ఆఫ్ ప్రజలు): తెలంగాణ ఉద్యమకారుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్, చిగురుమామిడి మండల మాజీ జెడ్పీటీసీ, మాజీ సర్పంచ్ గీకురు రవీందర్ ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ శుక్రవారం ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డితో కలిసి ఈటల రాజేందర్ రవీందర్ కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం రవీందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. గీకురు రవీందర్ తనకు సుదీర్ఘకాల ఉద్యమ సహచరుడని, ప్రజా సమస్యల పట్ల నిబద్ధతతో పనిచేసిన ప్రజా సేవకుడని అన్నారు. రవీందర్ అకాల మరణం తనను తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ప్రజా జీవితంలో తనతో కలిసి పనిచేసిన ఆప్తుడిని కోల్పోవడం వ్యక్తిగతంగా ఎంతో బాధాకరమన్నారు. రవీందర్ మృతి ఆయన కుటుంబానికే కాకుండా చిగురుమామిడి మండల ప్రజలకు, బీసీ వర్గాలకు, ఉద్యమ సహచరులకు తీరని లోటని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, సామాజిక సేవలో ముందుండే రవీందర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రవీందర్ కుటుంబ సభ్యులకు ఈటల రాజేందర్ ధైర్యం చెప్పి, ఈ విషాద సమయంలో కుటుంబానికి తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.

పట్టుదల,అంకితభావం, కఠోర శ్రమే విజయానికి సోపానాలు

నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్,సెప్టెంబర్ 11(వాయిస్ టుడే):పట్టుదల,అంకితభావం,కఠోర శ్రమతో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కరీంనగర్ నగర మేయర్ లికొలగాని శ్రీనివాస్ అన్నారు.జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాలలో నా దేశం నా జాతి నా బాధ్యత అనే అంశంపై వ్యక్తిత్వ నిర్మాణ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ యూత్ ప్రాజెక్ట్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 1893 సెప్టెంబర్ 11న అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన సర్వమత సమ్మేళనంలో స్వామి వివేకానంద చేసిన చారిత్రాత్మక ప్రసంగం ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ఔన్నత్యాన్ని చాటిందన్నారు. స్వామి వివేకానంద చూపిన మార్గం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు స్వామి వివేకానంద బోధనలు, ఆధ్యాత్మిక సందేశాలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, పట్టుదల,అంకితభావం,కఠోర శ్రమతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నతమైన విలువలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి వివిధ నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు సమాజం,దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మేయర్ ఆకాంక్షించారు.జిల్లా యువజన అధికారి జి.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతో పాటు వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని,సన్మార్గంలో నడుస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం,దేశభక్తి,సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఓ బి. సంపత్ కుమార్,ఏవో బి.శ్రావణ్ కుమార్, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఆర్. గోపికృష్ణ,నేషనల్ యూత్ ప్రాజెక్ట్ బాధ్యులు కె.యాదవరాజు,ఎం.డి. తాహర్ పాషా,అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉచిత దంత పరీక్ష శిబిరం

వాటర్ ప్యూరిఫైయర్ అందజేత

కరీంనగర్,సెప్టెంబర్ 11(వాయిస్ టుడే): కొత్తపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్ ఎస్ డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు.అనంతరం పాఠశాల విద్యార్థులకు దంత పరీక్ష నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు హాస్పిటల్ లో ఉచితంగా చూస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట పాఠశాలకు 100 లీటర్లు వాటర్ ప్యూరిఫైయర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు,ఎస్ఎస్ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ సునీల్ మంగళం, దంత వైద్య సిబ్బంది,గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి అంజనీకుమార్, ఉపసర్పంచ్,వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

అమరవీరులను ఆదుకోవడం మన బాధ్యత

అటవీ శాఖ అధికారి ఎస్ సత్యనారాయణ

కరీంనగర్,సెప్టెంబర్ 11(వాయిస్ టుడే): విధి నిర్వహణలో అశువులు బాసిన అమరవీరులను ఆదుకోవడం మన బాధ్యత అని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ సత్యనారాయణ అని అన్నారు. అటవీశాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కరీంనగర్,రాజన్న సిరిసిల్ల జిల్లా అటవి శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా విధి నిర్వహణలో అమరులైన 24 మంది అటవీ అధికారులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి విధి నిర్వహణలో అమరులైన కరీంనగర్ జిల్లాకు చెందిన కీర్తిశేషులు నరహరి మరియు లక్ష్మీనారాయణ సతీమణులను పుష్పలత,సరోజనలను సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ సత్యనారాయణ,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్ లావణ్య,కరీంనగర్ అటవీ క్షేత్రాధికారి ఎండి షౌకత్ హుసైన్,సిరిసిల్ల అటవీ క్షేత్రాధికారి నాగేశ్వర్ రావు,చందుర్తి అటవీ క్షేత్రాధికారి శీతల్,లయన్స్ క్లబ్ కరీంనగర్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్,సెప్టెంబర్ 11(వాయిస్ టుడే): నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.నగరంలోని 48వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కర్రె పద్మ అనిల్ ఆధ్వర్యంలో,అపోలో రీచ్ హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు.ప్రజలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.నగరంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని మేయర్ తెలిపారు.స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ ఆసుపత్రులు,వైద్యులు ముందుకు వచ్చి మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.ఈ వైద్య శిబిరంలో వైద్యులు ప్రజలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి,అవసరమైన వైద్య సలహాలు,సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాజ రమా శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్,నాయకులు ఉప్పరపల్లి శ్రీనివాస్,పర్వతం మల్లేశం,అపోలో రీచ్ హాస్పిటల్ సిబ్బంది,డివిజన్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

పీస్ కమిటీ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించిన సిరిసిల్ల పట్టణ పోలీసులు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 11(వాయిస్ టుడే): గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భం గా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి పీస్ కమిటీ సభ్యులు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు హాజరయ్యారు.గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు, నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన నియమలపై ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. గణేష్ మండపాల నిర్వాహకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, పోలీసుల సూచనలు పాటిస్తూ ఉత్సవాలను సజావుగా నిర్వహించేలా పీస్ కమిటీ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ సూచించారు.

జ్ఞానం ద్వారా విద్యార్థులకు సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు: అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో ఘనంగా నాలెడ్జ్ ఫెస్ట్

కరీంనగర్,సెప్టెంబర్ 11(వాయిస్ టుడే): జ్ఞానం చాలా విలువైనదని మరియు సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు పొందడానికి దోహదపడుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు.స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన నాలెడ్జ్ ఫెస్ట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విస్తృతమైన జ్ఞానాన్ని సంపాదించుకోవడం ద్వారా అనేక అవకాశాలనుఅందిపుచ్చుకోవడంతో పాటు,వివిధ పోటీ పరీక్షల్లో విజయాలు సాధించవచ్చని వారు చెప్పారు.తమ ముందుకు వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యం: ఎంఈఓ వెంకట నరసింహులు

హత్నూర, సెప్టెంబర్ 11 (వాయిస్ టుడే): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హత్నూర మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ కార్యాలయం సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులకు శాలువాలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకట నరసింహులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, విజ్ఞానం పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీయడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల విజయమే ఉపాధ్యాయులకు నిజమైన గుర్తింపు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో హత్నూర మండలంలోని వివిధ పాఠశాలలు, గురుకులాలు, కళాశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రదానోత్సవం

కొత్తపల్లి,సెప్టెంబర్ 11(వాయిస్ టుడే): కొత్తపల్లి మండలంలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన ఉత్తమ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించి అవార్డులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమానికి ఎంఈఓ తుమ్మ ఆనందం ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని,విద్యార్థుల అభ్యున్నతి కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏంఆర్ఓ వెంకటలక్ష్మి,కాంప్లెక్స్ హెచ్ఎం కన్నం రమేష్,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించిన సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను కోరిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్,సెప్టెంబర్ 11(వాయిస్ టుడే): వినాయక నవరాత్రుల సందర్భంగా కొత్తపల్లి చెరువు వద్ద వినాయక నిమజ్జనానికి సంబంధించి ఏర్పాట్లను సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పరిశీలించారు.గతంలో నిమజ్జనం చేసే ప్రాంతం భూమి పట్టాదారు కోర్టుకు వెళ్లడంతో నిమజ్జన స్థలం మార్చవలసి వచ్చినందున నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు నరేందర్ రెడ్డి సూచించారు.పట్టాదారు కిషన్ రెడ్డి ఏర్పాట్లు చేసే ప్రాంతానికి వచ్చి మా భూమిని వాడుకుంటే ఎటువంటి అభ్యంతరం లేదని దాని బదులు వేరే భూమి ఇవ్వాలని మాత్రమే ప్రభుత్వాన్ని కోరుతున్నానని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున తిరిగి కోర్టు కు తెలియజేసి ఆ స్థలాన్ని వాడుకోవలసి ఉంటుందని నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు.కొత్తగా నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్న స్థలం పరిధి ఎక్కువగా ఉండేట్టు చూడాలని నిమజ్జనానికి 500 లకు పైగా విగ్రహాలు ఇక్కడికి వస్తాయని నిమజ్జనం చేసిన తరువాత వాహనాలు వెంటనే అక్కడినుండి ఖాళీ అయ్యేవిధంగా ఏర్పాట్లు చేయాలని నరేందర్ రెడ్డి అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి సిఐ బిల్ల కోటేశ్వర్,మున్సిపల్ సిబ్బంది పరశురాములు కాంట్రాక్టర్ సతీష్ స్థానిక నాయకులు గడ్డం శ్రీనివాస్, పొన్నం శ్రీనివాస్,గున్నాల రమేష్,ఖాజా,దుబ్బాసి కుమార్,తుమ్మ ప్రతాప్ రెడ్డి,రాపర్తి రాజు,చింతల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

రాజన్న ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 11 (వాయిస్ టుడే): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ అభివృద్ధి, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్. వివిధ శాఖల అధికారులతో ఐడీఓసీ సమీక్ష.వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యం లో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను శరవేగం గా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.